## క్లుప్తంగా

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### నేడు 'స్పందన' కార్యక్రమం

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే అన్నారు. ఈ మేరకు బ్రాహ్మణపల్లె సచివాలయంలో ఉదయం 10-30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. అలాగే ఆ సచివాలయం పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

### నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో కుచ్చుపాప గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసిన మందులను పంపిణీ చేయటం జరుగుతుందని వైద్యాధికారి తెలియజేశారు.

### నేడు పెండ్లిమర్రికి ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు హజరుకావాలని ఆయన కోరారు.

### అరటి పంట దగ్ధం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కౌలుదారుడు పి.కృష్ణారెడ్డి 5 ఎకరాల్లో అరటిపంట ప్రమాదవశాత్తు కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఉదయం 10 గంటల సమయంలో పొలంలో పనులు చేసుకుంటుండగా మంటలు చెలరేగాయని తెలిపారు. ఎకరాకు రూ.20 వేలు గుత్త చెల్లించి కౌలుకు తీసుకున్నానని, పంట పూర్తిగా కాలిపోవడంతో నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు కోరారు.

### అమృతానగర్‌లో కార్డన్ సర్చ్



స్థానికులతో మాట్లాడుతున్న సీఐలు యుగంధర్, నారాయణయాదవ్

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు రూరల్ పరిధిలోని అమృతానగర్‌లో ఆదివారం కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత, కొత్త అమృతానగర్‌లలోని అనుమానిత ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వాహనాల రికార్డులను కూడా పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. రూరల్ ఇన్‌చార్జి సీఐ యుగంధర్, త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్‌లు ప్రజలతో సమావేశం నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులకు ఇళ్లను బాడుగకు ఇచ్చే ముందు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐలు చెప్పారు.

### పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపో నుంచి వేలాంగిణి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు నుంచి వేలాంగిణికి ప్రతి శుక్రవారం (జూన్ 2,9,16,23,30 తేదీలు) ప్రత్యేక బస్సు ఉంటుందని, శుక్రవారం సాయంత్రం 7 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 10 గంటలకు వేలాంగిణి చేరుకుని మళ్ళీ అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 5 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. బద్వేలు-వేలాంగిణి టిక్కెట్ ధర రూ.2430లు, పోరుమామిళ్ల-వేలాంగిణి రూ.2530లు ఉంటుందని తెలిపారు. అలాగే బద్వేలు నుంచి అరుణాచలంకు పౌర్ణమి సందర్భంగా జూన్ నెల 3వ తేదీన ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని, ఈ బస్సు 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు బయలుదేరుతుందని, టిక్కెట్ ధర రూ.1240లు ఉంటుందని తెలిపారు.

## ఘనంగా గంగ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

రాజుపాళెం : మండల పరిధి అర్కటవేముల గ్రామంలోని పాత గంగమ్మ దేవాలయం వద్ద ఆదివారం గంగ జాతర (ఆవుల పబ్బం)ను ఘనంగా నిర్వహించారు. ఆలయం, అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టారు. అనంతరం తప్పెట్లు, మేళతాళాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని గంగమ్మ, పెద్దమ్మకు సమర్పించి జంతు బలులు ఇచ్చారు. బంధువులు, స్నేహితులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



గంగజాతరలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

## అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలేవి?



గోపవరంలో అనుమతులు లేకుండా ఉపాధ్యాయులు వేసిన లేఅవుట్ ఇదే

గోపవరం : మండలంలో అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలేవి అని ప్రజలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. బేతాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో పి.పి.కుంట, గోపవరం పంచాయతీ పరిధిలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారి పక్కనే వేసిన లేఅవుట్లకు అనుడా నుండి ఎలాంటి అనుమతులు లేవు. ఇటీవల అనుడా వీసీ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న లేఅవుట్లకు అనుమతులు ఉన్నాయా లేదా అని ఆరా తీయగా ఒక్క లేఅవుట్‌కు కూడా ఇంత వరకు అనుడా నుండి అనుమతులు రాలేదని కార్యదర్శులు వీసీకి తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లను పరిశీలించి నోటీసులు జారీ చేయాలని వీసీ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కానీ ఇంత వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. గోపవరం గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఉపాధ్యాయులు వేసిన లేఅవుట్‌కు ఇప్పటి వరకు ల్యాండ్ కన్వర్షన్ కూడా జరగలేదు. ప్లాట్ల క్రయవిక్రయాలు జరుగుతుండటంతో కొనుగోలు చేసిన వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండి నిబంధనలను అతిక్రమించి అనుమతులు లేని లేఅవుట్లు వేసి యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా సంబంధిత అధికారులు వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధిక శాతం లేఅవుట్లలో 90 శాతం పైగా ప్లాట్ల కొనుగోలు పూర్తయ్యాయి. సబ్ రిజిష్టర్ కార్యాలయంలో లేఅవుట్లకు సంబంధించిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండటంతో కొనుగోలు చేసిన వినియోగదారులు నిబంధనల గురించి పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొనుగోలు చేసిన వినియోగదారులు ఇప్పుడు ఆందోళనకు గురవుతున్నారు. లేఅవుట్‌లలో ప్రజా ప్రయోజనాల కోసం గ్రామ పంచాయతీలకు 10 శాతం స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఒక్క లేఅవుట్‌లో కూడా స్థలం కేటాయించలేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

### నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాలను పూడ్చుకోవడానికి కూడా పనికి రాదని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించినందుకు నిరసనగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి నియోజవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. రామేశ్వరం నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, శివాలయం రోడ్డు మీదుగా మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగుతుందని ఆయన వివరించారు.

### విద్యార్థులకు బహుమతులు ప్రదానం

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 30 మంది విద్యార్థులకు హెడ్మాస్టర్ అబ్దుల్‌హుసేన్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఆఫ్రిది మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో ఇంతవరకు నిర్వహించిన వివిధ పోటీలలో 30 మంది విద్యార్థులు విజేతలుగా నిలవడంతో వారికి ఈ బహుమతులు ఇచ్చారన్నారు.

## ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూతాశ్రమం గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉదయం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి, అమ్మవార్లను అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయంలో అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గంగమ్మఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కడప మేయర్ సురేష్‌బాబు

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు ఎస్టీకాలనీలో వెలసిన గంగమ్మ సమేత పోతురాజు ఆలయంలో ఆదివారం ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు దున్నూతల రాజారెడ్డి ఆధ్వర్యంలో జాతర మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బోవిళ్ల పిచ్చిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డెయ్య, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1984-85 పదో తరగతి విద్యార్థులు

మైదుకూరు : బాల్యంలో ఒక చోట చదువుకుని తర్వాత ఉన్నత చదువులు, ఉపాధి కోసం ఎక్కడికెక్కడికో వెళ్లిన వారంతా ఆదివారం తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. జ్ఞాపకాలను కలబోసుకున్నారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో తాము చదువుకున్న పాఠశాలలోని తరగతి గదులను పరిసరాలను చూసి పులకించిపోయారు. అప్పటి సంగతులను, ఉపాధ్యాయుల బోధనను గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. అక్కడ తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం అందుకున్నారు.

## ఆలయంలో జీవనశైలి పర్యావరణ కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, సిబ్బంది

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం అటవీశాఖ సిబ్బంది లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్(జీవనశైలి పర్యావరణ) కార్యక్రమం నిర్వహించారు. సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ నేతృత్వంలో అటవీ సిబ్బంది, ప్రజలు గురప్పస్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, చెత్త ఏరి, కుప్పగా వేసి కాల్చి వేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆలయాల ఆవరణ శుభ్రంగా ఉంటే వచ్చే భక్తులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వాతావరణ సమతుల్యత కాపాడేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది వెంకటేష్, వీరప్రతాప్, స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రజలు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైస్పేస్ తైక్వాండో క్రీడాకారులు తాడిపత్రిలో 27, 28వ తేదీల్లో నిర్వహించిన మొదటి రాయలసీమ తైక్వాండో చాంపియన్ షిప్ క్యోరుగి, పుమ్సే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్ క్యోరుగి బాలికల విభాగంలో అయేషా, ముష్‌పెర్రా, అర్ఫా, అఫ్రీన్ కాంస్య పతకాలు, బాలురు విభాగంలో నంద కిశోర్ రజత పతకం, రాయిస్, యూసిఫ్, ఫైజెర్, అహదుద్దీన్ కాంస్య పతకాలు, క్యాడెంట్ బాలికల విభాగంలో ఖన్సా బంగారు పతకం, బాలురు విభాగంలో ఇర్ఫాన్ బంగారు పతకాలు, షణ్ముఖ రజత, శ్రావణ్ కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ బాలుర విభాగంలో పవన్ సాయి బంగారు పతకం, హంజా రజత, సుభాష్ కాంస్య పతకాలు పొందారు. సీనియర్ బాలుర విభాగంలో ఇస్మాయిల్, మౌని వర్ధన్ రెడ్డి, సాయి కళ్యాణ్ బంగారు పతకాలు సాధించారు. వీరిని కోచ్‌లు సలీం, మహబూబ్‌బాషా, తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్ రసూల్ అభినందించారు.

## చంద్రబాబు మోసాలపై బైక్ ర్యాలీ

చాపాడు: 2014 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను మోసం చేస్తూ.. మళ్లీ మోసపూరిత హామీలు ఇస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరును నిరసిస్తూ సోమవారం చేపట్టబోయే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ మేనిఫెస్టోలో చేస్తున్న మోసాలను ఎండగడుతూ.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి దువ్వూరులోని కోదండ రామాలయం నుంచి ప్రారంభమై గుడిపాడు, చింతకుంట, మైదుకూరు మీదుగా ఖాజీపేటలోని కేసీ కెనాల్ బంగ్లా వరకూ 3వేల బైక్‌లతో ర్యాలీ జరుపటం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛంగా బైక్‌లో ర్యాలీలో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

దువ్వూరు : మండల కేంద్రమైన పాత దువ్వూరు కోదండరామస్వామి ఆలయం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయక మోసం చేశారని, ప్రస్తుత మహానాడులో కొత్త మేనిఫెస్టో మళ్లీ ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఇందుకు నిరసనగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీ దువ్వూరు, గుడిపాడు, చింతకుంట మీదుగా ఖాజీపేటలోని కేసీ కెనాల్ బంగ్లా వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉల్లాసంగా వేసవి శిక్షణ శిబిరాలు

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట ఎంపీపీ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవిలో విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, బుక్స్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, పద్యాల పోటీ, డ్యాన్స్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పుస్తకాలను విద్యార్థులతో చదివిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మ్యూజికల్ చైర్స్ పోటీలు**

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నరసింహారెడ్డి నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదం అందిస్తుండటంతో మనస్సు, ఏకాగ్రత నిశ్చలతగా ఉంటుందని తెలిపారు. అనంతరం క్యారమ్స్, చెస్ వంటివి ఆడినట్లు ఆయన చెప్పారు.

## చరిత్రాత్మక నిర్ణయంతో చుక్కల భూములకు విముక్తి

- రైతులకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి
- మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- చాపాడులో నిషేధిత జాబితా తొలగింపు పత్రాలు పంపిణీ



చుక్కల భూముల రైతులకు విముక్తి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: రాష్ట్రంలో 1916 నుంచి ఏ ముఖ్యమంత్రి సాహసం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని చుక్కల భూములకు విముక్తి కల్పించారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఆశీర్వదించి తమ చల్లని దీవెనలను అందించాలని మైదుకరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. జిల్లాలో మొదటిసారిగా మండల కేంద్రమైన చాపాడులోని వైఎస్ కల్యాణ మండపంలో ఆదివారం 3, 620 ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పిస్తూ 3,826 మంది రైతులకు నిషేధిత జాబితా విముక్తి పత్రాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏన్నో ఏళ్లుగా భూములు ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలకు, క్రయ విక్రయాలు నోచుకోండా.. వేలాది రైతులు బ్రిటీషు కాలం నుంచి ఇబ్బందులు పడుతూ వచ్చారు. రైతులకు సమస్యగా ఉన్న చుక్కల భూములను సీఎం వైఎస్ జగన్ నిషేధిత జాబితా నుంచి తొలగింపు చేయటం రైతులకు వరంలాంటిదన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు రైతులకు ఏనాడు మంచి చేయలేదన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో కేసీ కాలువకు సాగునీరు రావాలంటే ఏటా ఉద్యమాలు, ధర్నాలు చేసే దుస్థితి ఉండేదన్నారు. 2019లో వైఎస్ జగన్ సీఎం అయినప్పటి నుంచి కేసీ ఆయకట్టులో రెండు కార్లకు సాగునీరు రైతులకు సంవృద్ధిగా అందుతోందన్నారు. నియోజకవర్గంలో రైతుభరోసా కింద రూ.192 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.32 కోట్లు, సున్నీ నగదు రూ.10కోట్లు, పంటల బీమా రూ.112కోట్లు వచ్చిందన్నారు.

**2.06 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి**

సీఎం వైఎస్ జగన్ చరిత్రను తిరగరాస్తూ చుక్కల భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించేందుకు జీఓ నెంబరు 152ను విడుదల చేసి రైతుల ముఖాల్లో చిరునవ్వు తెప్పించారన్నారు. సీఎం జగన్ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రంలో 2.06 లక్షల ఎకరాలకు చుక్కల భూములకు విముక్తి కలిగి లక్ష మందికి రైతులకు మేలు జరుగుతోందన్నారు. చుక్కల భూములు కలిగిన రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను రెవెన్యూ సిబ్బందికి సమర్పించి రూపాయి ఖర్చు లేకుండా ఆన్‌లైన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రెవెన్యూ చరిత్రలో ఇది చెప్పకోదగిన మార్పు అన్నారు. ఇందులో అధికారులు భాగస్వాములు కావటం గొప్ప అంశమన్నారు.

**సీఎం జగన్ చిత్ర పటానికి రైతులు పాలాభిషేకం**

చాపాడు మండలంలోని చుక్కల భూములు కలిగిన రైతులందరూ సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. రైతులు తమకు మంచి చేసిన సీఎం జగన్ పట్ల పాలాభిషేం చేసి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య, మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, తహసీల్దారు సుభానీ, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, రైతు సలహా మండలి సభ్యులు నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామోహన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రుతుక్రమంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వీణాకుమారి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, మెప్మా సిబ్బంది

ప్రొద్దుటూరు : యుక్త వయసులో వచ్చే మార్పులతో పాటు రుతుక్రమంపై బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ వీణాకుమారి తెలిపారు. నెలసరి శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా శక్తి భవనంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మెప్మా టీఈ కెజియా జాస్లిన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీణా కుమారి మాట్లాడతూ యుక్తవయసు బాలికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదివారం నెలసరి శుభ్రతా దినోత్సవంగా ఏర్పాటు చేసిందన్నారు. భారత దేశంలోని మహిళల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. శానిటరీ నాప్‌కిన్స్ ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. తప్పనిసరిగా బాలిక 10-17 ఏళ్లలోపు రజస్వల అవుతుందన్నారు. అలా కాని పక్షంలో తల్లి బాలికను తీసుకెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి నెల 28 రోజుల నుంచి 40 రోజుల మధ్యలో శరీరాన్ని బట్టి రుతుక్రమం వస్తుందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు, కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ బద్వేలి శివప్రసాదరెడ్డి, సీఓ సుబ్బారెడ్డి, మెప్మా సీఓలు, డాక్టర్ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

**అవగాహన కలిగి ఉండాలి**

బద్వేలు అర్బన్ : ఋతుస్రావమనేది మహిళల్లో ఒక సహజ ప్రక్రియ అని, దీనిపై మహిళలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జి.రామలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ ఋతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మెప్మా కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఋతుక్రమ సమయంలో మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలన్నారు. పరిశుభ్రత, సరైన నెలవారీ ఏర్పాట్లను అవలంబించడం ద్వారా ఋతుస్రావంపై ఉన్న అపోహలను తొలగించవచ్చన్నారు. అలాగే నెలసరి సమయంలో వచ్చే కడుపునొప్పికి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. నెలవారీ సమయంలో విశ్రాంతితో పాటు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, ఇది శరీరంలో రక్తహీనతను నివారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా అధికారి అయ్యవారయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్‌పర్సన్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**రుతుక్రమంపై అపోహలు వద్దు**



బాలికకు నాప్‌కిన్ అందిస్తున్న డాక్టర్ లలిత

మైదుకూరు : మహిళల్లో రుతుక్రమమనేది సహజ ప్రక్రియ అని దానిపై అపోహలను పెట్టుకోవద్దని పట్టణానికి చెందిన స్త్రీవ్యాధుల నిపుణురాలు డాక్టర్ లలిత అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో 'మెన్‌స్ట్రువల్ హైజీన్ డే' సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్త్రీ శక్తి భవనం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలు, బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ లలిత మాట్లాడుతూ రుతుక్రమంపై మహిళల్లో అనేక అపోహలున్నాయన్నారు. కేవలం మూఢనమ్మకాల వల్లే అలా చేస్తారని పేర్కొన్నారు. ఋతుక్రమం సమయంలో శారీరక పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి మహిళల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. మెప్మా టీఈ మహాలక్ష్మి, సీఓలు సుబ్బరాయుడు, పుల్లయ్య పాల్గొన్నారు.